క్లుప్తంగా

నేడు విద్యుత్ సరఫరా ఉండని ప్రాంతాలు

పెదగంట్యాడ: 11కేవీ బీసీఎల్ ఫీడర్ సబ్‌స్టేషన్ పరిధిలో మరమ్మతులు నిర్వహించనున్న నేపథ్యంలో ఈ నెల 26న విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నామని ఏపీఈపీడీసీఎల్ జోన్–2 ఈఈ బీకే నాయుడు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కారణంగా సంబంధిత సబ్‌స్టేషన్ పరిధిలోని గిరిజా కాలనీ, దయాల్‌నగర్, సంజీవ కాలనీ, టీఎన్నార్ ఫంక్షన్ హాల్ ఏరియా తదితర ప్రాంతాల్లో శుక్రవారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని పేర్కొన్నారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

అనాథ బాలలకు భోజన వసతి


పిల్లలకు భోజనం వడ్డిస్తున్న విజయ్‌కుమార్ కుటుంబ సభ్యులు

అగనంపూడి: జీవీఎంసీ 88వ వార్డు మంగళపాలెంలోని అనాథాశ్రమంలో బాలలకు సామాజిక కార్యకర్త డాక్టర్ జొన్నకూటి విజయ్‌కుమార్ కుటుంబ సభ్యులు భోజన వసతి కల్పించారు. నిత్యావసర వస్తువులు అందించారు. విజయ్‌కుమార్, కుమారి దంపతుల మనుమరాలు అక్షయ ఏంజిలీనా జన్మదినోత్సవం సందర్భంగా ఈ కార్యక్రమం చేపట్టారు. కేక్ కట్ చేసి, స్వీట్లు పంచారు. కార్యక్రమంలో జొన్నకూటి అవినాష్, పీవీకె ప్రసాద్, బి.ఎం.రావు తదితరులు పాల్గొన్నారు.

గణపతి నవరాత్రి ఉత్సవాల పోస్టర్ ఆవిష్కరణ


ఉత్సవాల పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న కార్పొరేటర్ శ్రీనివాసరావు

పెదగంట్యాడ: జీవీఎంసీ 76వ వార్డు నడుపూరులోని సంకట మోచన గణపతి ఆలయంలో సెప్టెంబర్ 7 నుంచి 16వ తేదీ వరకు గణపతి నవరాత్రి ఉత్సవాలను ఘనంగా నిర్వహించనున్నామని ఆలయ కమిటీ ప్రతినిధులు తెలిపారు. ఆలయ ఆవరణంలో ఉత్సవాల పోస్టర్‌ను కార్పొరేటర్ గంధం శ్రీనివాసరావు గురువారం ఆవిష్కరించారు. కార్యక్రమంలో హ్యూమన్ రైట్స్ కార్యదర్శి మంత్రి శ్యామ్ ప్రసాద్, ఆలయ కమిటీ అధ్యక్షుడు మంత్రి నరసింహమూర్తి, మంత్రి శంకరనారాయణ, భాస్కరరావు తదితరులు పాల్గొన్నారు.

పరిశ్రమ సంసిద్ధతపై విద్యార్థులకు అవగాహన



మాట్లాడుతున్న ఆచార్య పల్లంశెట్టి

అక్కిరెడ్డిపాలెం: పరిశ్రమ సంసిద్ధతపై గాజువాక శ్రీ చైతన్య మహిళా డిగ్రీ మరియు పీజీ కళాశాలలో గురువారం వర్క్‌షాపు నిర్వహించారు. కార్యక్రమానికి హాజరైన ఏయూ విశ్రాంత ఆచార్యులు, సెంటర్ ఫర్ రీసెర్చ్ టెక్నాలజీ సీఈవో ఆచార్య పల్లంశెట్టి మాట్లాడుతూ జాతీయ, అంతర్జాతీయ సంస్థల్లో ఉద్యోగాలు సాధించేందుకు అవసరమైన ప్రావీణ్యం గురించి వివరించారు. క్లౌడ్ కంప్యూటింగ్, వెబ్ డిజైనింగ్, టికెటింగ్, టెస్టింగ్ తదితర అంశాలపై విద్యార్థులకు పి.పి.టి ద్వారా అవగాహన కల్పించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ చంద్ర మహాలక్ష్మి, యశ్వంత్, చరణ్, డైరెక్టర్ కామేశ్వరి, వైస్ ప్రిన్సిపాల్ జోగారావు, అధ్యాపకులు పాల్గొన్నారు.

వేగ నిరోధకాలా.. ప్రమాద కారకాలా..!

- స్టీల్‌ప్లాంట్‌లో ప్రమాణాలకు విరుద్ధంగా స్పీడ్ బ్రేకర్లు
- తరచూ ప్రమాదాలు
- హడలిపోతున్న ఉద్యోగులు


ఉక్కునగరంలో బాగా ఎత్తుగా నిర్మించిన స్పీడ్ బ్రేకర్


ఉక్కునగరం క్లబ్ ఎదురుగా స్పీడ్ బ్రేకర్ వద్ద ప్రయాణిస్తున్న ద్విచక్ర వాహనచోదకులు

ఉక్కునగరం: వాహనాల వేగాన్ని నియంత్రించి, ప్రమాదాలు జరగకుండా ఏర్పాటు చేసిన స్పీడ్ బ్రేకర్లే ప్రమాదాలకు కారణమవుతున్నాయని ఉక్కు ఉద్యోగులు, ప్రయాణికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. స్టీల్‌ప్లాంట్ ప్రధాన రహదారిలో, టౌన్‌షిప్‌లో ఏర్పాటు చేసిన స్పీడ్ బ్రేకర్లు ఉద్యోగులను హడలెత్తిస్తున్నాయి. స్పీడ్ బ్రేకర్లు వేసిన దగ్గర నుంచి రోజూ చిన్నాచితక ప్రమాదాలు జరగడంతో పాటు ఉద్యోగులకు ఆరోగ్య సమస్యలు తెచ్చిపెడుతున్నాయి.

స్టీల్‌ప్లాంట్ ప్రధాన రహదారిలోని హిల్ టాప్ గెస్ట్‌హౌస్ కూడలి సమీపంలో, ట్రై వీక్లీ మార్కెట్ కూడలి, అడ్మిన్ బిల్డింగ్ కూడలి వద్ద, ఉక్కు జనరల్ ఆస్పత్రి ముందు, జనరల్ ఆస్పత్రి నుంచి అగనంపూడి వెళ్లే రహదారి కూడలి వద్ద, శ్రీచైతన్య జూనియర్ కళాశాల వద్ద కొంతకాలం క్రితం స్పీడ్ బ్రేకర్లు వేశారు. ఆయా ప్రాంతాల్లో వేగాన్ని నియంత్రించడం ద్వారా ప్రమాదాలు తగ్గించే లక్ష్యంతో స్పీడ్ బ్రేకర్లు వేశారు. స్పీడ్ బ్రేకర్లు వేయడం మంచిదే అయితే స్పీడ్ బ్రేకర్లు వేసిన తీరుపై ఉద్యోగులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.


ఉక్కు జనరల్ ఆస్పత్రి కూడలి వద్ద ..

జాతీయ రహదారిలో వేగాన్ని నియంత్రించేందుకు చిన్నపాటి ఎత్తుతో కూడిన స్పీడ్ బ్రేకర్లు వేస్తున్నారు. అటువంటివి కాకుండా స్పీడ్ బ్రేకర్ ప్రమాణాలకు విరుద్ధంగా ఎత్తుగా వేయడం వల్ల ఉద్యోగులు ఇబ్బందులు పడుతున్నారు. తరచూ ప్రమాదాలతో గాయాలపాలై ఆస్పత్రులకు వెళ్తున్నారు. ద్విచక్రవాహనాలపై వెళ్లే ఉక్కు ఉద్యోగులకు నడుం నొప్పులు తెచ్చి పెడుతున్నాయి. కార్ల దిగువన ఉండే చాసీ, సైలెన్సర్‌కు తగులుతున్నాయంటే స్పీడ్ బ్రేకర్లు ఎంత దారుణంగా ఉన్నాయో అర్థమవుతోంది. సంబంధిత అధికారులు స్పందించి, వెంటనే స్పీడ్ బ్రేకర్లను సరిచేయాలని ఉద్యోగులు డిమాండ్ చేస్తున్నారు.

స్పీడ్ బ్రేకర్లను సరి చేయాలి



ఇటీవల స్టీల్‌ప్లాంట్‌లో వేసిన స్పీడ్ బ్రేకర్లు చాలా ప్రమాదకరంగా ఉన్నాయి. వాటి వల్ల ప్రమాదాలు జరగడంతో పాటు ఉద్యోగులకు వెన్నునొప్పులు, మెడ నొప్పులు వచ్చేలా ఉన్నాయి. వాటిని జాతీయ రహదారిలో వేస్తున్న స్పీడ్ బ్రేకర్లుగా మార్చాలి.

– కర్రి దాలినాయుడు, వర్కింగ్ ప్రెసిడెంట్, స్టీల్ వైఎస్సార్‌టీయూసీ

'ఉక్కు'ను ప్రభుత్వరంగ సంస్థగా కొనసాగించాల్సిందే..


మాట్లాడుతున్న ఏఐటీయుసీ ప్రధాన కార్యదర్శి ఆదినారాయణ

అగనంపూడి: విశాఖ ఉక్కు ప్రజల సొత్తని, దానిపై రాష్ట్ర ప్రజలకు పూర్తి హక్కు ఉందని విశాఖ ఉక్కు పరిరక్షణ కమిటీ చైర్మన్ డి.ఆదినారాయణ అన్నారు. కాదని, మొండిగా ముందుకు వెళ్లి ప్రైవేటీకరణ చేయాలని చూస్తే ఉపేక్షించేది లేదన్నారు. స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణ యత్నాలకు నిరసనగా కూర్మన్నపాలెం కూడలిలో చేపట్టిన రిలే దీక్షల్లో 1260వ రోజు ఆయన మాట్లాడారు. మూడోసారి అత్తెసరు మెజార్టీతో అధికారంలోకి వచ్చినా మోదీ, అమిత్‌షా ఆలోచనా ధోరణిని మార్చుకోలేదని మండిపడ్డారు. లక్షల కోట్ల విలువైన ప్రజాధనాన్ని లూటీ చేసి ప్రైవేటు వ్యక్తుల చేతుల్లో పెట్టాలనుకుంటున్న కేంద్ర ప్రభుత్వం అదే ధోరణితో ముందుకు వెళ్తే ప్రజల చీత్కారాలు తప్పవన్నారు. ఉక్కును సెయిల్‌లో విలీనం చేయడం తప్ప వేరే మార్గం ఏదీ సరికాదన్నారు. కార్యక్రమంలో కసిరెడ్డి సత్యనారాయణ, వరసాల శ్రీనివాసరావు, దాసరి శ్రీనివాస్, కె.శ్రీనివాసులు నాయుడు, ఏఐటీయుసీ నాయకులు కిడిమి రాజబాబు, ఎ.మసేనురావు, డొక్కా నరసింగరావు, నరేష్‌కుమార్, జి.జయ, తాండ్ర కనకరాజు, డి.దేముడు, గుమ్మడి నరేంద కుమార్, శివరామకృష్ణ, మురళీకృష్ణ, జ్యోతి ప్రసాద్, సింహాద్రి తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సమస్యలపై రాజీలేని పోరు


సమావేశంలో మాట్లాడుతున్న సత్యనారాయణ

పెదగంట్యాడ: ప్రజా సమస్యల పరిష్కారం కోసం రాజీలేని పోరు సాగిస్తామని సీపీఐ గాజువాక నియోజకవర్గ కార్యదర్శి కసిరెడ్డి సత్యనారాయణ స్పష్టం చేశారు. గాజువాక నియోజకవర్గ సీపీఐ సర్వ సభ్య సమావేశాన్ని స్థానిక పోతిన సన్యాసిరావు భవన్‌లో గురువారం జి.ఆనంద్ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్రంలో, రాష్ట్రంలో కొత్తగా ఏర్పాటైన ప్రభుత్వాలు ప్రజల సమస్యలపై దృష్టి సారించాలని కోరారు. ఈ విషయంలో ప్రభుత్వాలు నిర్లక్ష్యం చేస్తే పోరాటాలకు తాము సిద్ధంగా ఉన్నామన్నారు. సమావేశంలో పల్లేటి పోలయ్య, కెంగువ అచ్యుతరావు, తాండ్ర కనకరాజు, రాజబాబు, పోతన్న, దుర్గారావు తదితరులు పాల్గొన్నారు.

ఐటీఐలో మిగులు సీట్ల భర్తీకి దరఖాస్తుల ఆహ్వానం

పెదగంట్యాడ: స్టీల్‌సిటీ ప్రభుత్వ ఐటీఐలో మిగులు సీట్ల రెండో విడత భర్తీ కోసం దరఖాస్తులను ఆహ్వానిస్తున్నామని ఐటీఐ ప్రిన్సిపాల్ కె శ్రీనివాసరావు గురువారం ఒక ప్రకటనలో కోరారు. ఆసక్తి గల అభ్యర్థులు ఈ నెల 24లోగా iti.gov.in పోర్టల్ ద్వారా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్న కాపీ, ఒరిజినల్ సర్టిఫికెట్లతో వెరిఫికేషన్ చేయించుకున్న అభ్యర్థులు ఐటీఐలో ప్రవేశం కోసం ఈ నెల 27న ఉదయం 9.30 గంటల నుంచి నిర్వహించనున్న కౌన్సెలింగ్‌కు హాజరు కావాలని పేర్కొన్నారు.

విద్యార్థులకు సంప్రదాయ క్రీడాపోటీలు


గోలీలాట ఆడుతున్న విద్యార్థులు


ఒప్పులకుప్ప ఆడుతున్న బాలికలు

పెదగంట్యాడ: పూర్వకాలంలో ఆడే సంప్రదాయ క్రీడలు కనుమరుగవుతున్నాయని నడుపూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు రాచకొండ శ్రీనివాస్ అన్నారు. వాటి పట్ల విద్యార్థులకు అవగాహన కల్పించి, ఆ ఆటలను ఆడేలా ఉపాధ్యాయులు శ్రద్ధ చూపాలని సూచించారు. శిక్షా సప్తాహ్ కార్యక్రమంలో భాగంగా నడుపూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నాలుగో రోజు కార్యక్రమంలో భాగంగా గురువారం విద్యార్థులకు తమ చిన్నతనంలో ఆడిన అష్టాచమ్మా, బొంగరాలట, చారడేసి మొగ్గ, బచ్చాలాట, కాళ్ల గజ్జా కంకాలమ్మ, దాగుడుమూతలు, గోలీలాట, ఏడు పెంకులాట, ఒప్పులకుప్ప వయ్యారిభామ, చింతగింజలాట వంటి అనేక ఆటలు ఆడించి, పోటీలు నిర్వహించారు. ఆటల్లో విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. అనంతరం పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో పాఠశాల సిబ్బంది షమీం తదితరులు పాల్గొన్నారు.

కేంద్ర బడ్జెట్‌పై సీపీఎం నిరసన


గాజువాకలో నిరసన తెలుపుతున్న సీపీఎం నాయకులు

అక్కిరెడ్డిపాలెం: కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో స్టీల్‌ప్లాంట్ కోసం మాట్లాడకపోవడం, ఉత్తరాంధ్రకు నిధులు కేటాయించకపోవడం అన్యాయమని సీపీఎం గాజువాక జోన్ కార్యదర్శి గొలగాని అప్పారావు అన్నారు. కేంద్ర బడ్జెట్‌కు వ్యతిరేకంగా సీపీఎం నాయకులు గాజువాకలో గురువారం నిరసన ప్రదర్శన చేపట్టారు. ఈ సందర్భంగా అప్పారావు మాట్లాడుతూ బడ్జెట్ ప్రవేశపెట్టడంలో బీజేపీ ప్రభుత్వం దుర్మార్గం బయటపడిందన్నారు. రైతులకు, వ్యవసాయ కార్మికులకు, పేదలకు ఈ బడ్జెట్ వ్యతిరేకంగా, కార్పొరేట్ శక్తులకు అనుకూలంగా ఉందని అన్నారు. ఈ బడ్జెట్‌లపై సెమినార్లు నిర్వహించి ప్రజలను చైతన్యపరిచి, పోరాటాలు ఉధృతం చేస్తామన్నారు. కార్యక్రమంలో జోన్ కమిటీ సభ్యులు ఎ.లోకేష్, జోగవానిపాలెం కార్యదర్శి పి.లక్ష్మి స్వామి, నానాజీ, టోల్‌గేటు యూనియన్ ప్రధాన కార్యదర్శి కె.చందర్‌రావు తదితరులు పాల్గొన్నారు.

గ్రాంట్ మంజూరు చేయాలి

పెదగంట్యాడ: ఆంధ్రప్రదేశ్ రాజధాని అమరావతి నిర్మాణానికి కేంద్ర ప్రభుత్వం అప్పు కాకుండా గ్రాంట్ మంజూరు చేయాలని సీపీఎం నాయకులు కొవిరి అప్పలరాజు, జి.శ్రీనివాస్ డిమాండ్ చేశారు. రాష్ట్రానికి కేంద్ర బడ్జెట్‌లో నిధుల కేటాయించకుండా మోసం చేశారని ధ్వజమెత్తారు. ఈ మేరకు మండలంలోని గంగవరం పోర్టు వంతెన సమీపంలోని గాంధీ విగ్రహం వద్ద గురువారం ఆందోళన చేశారు. వారు మాట్లాడుతూ స్టీల్‌ప్లాంట్‌కు ఆర్థిక సాయం చేయాలని కోరారు. కార్యక్రమంలో నమ్మి రమణ, గురప్ప, కణితి అప్పలరాజు, పేర్ల మసేను తదితరులు పాల్గొన్నారు.

కుక్కల దాడిలో బాలుడికి గాయాలు


గాయపడ్డ బాలుడు


నడుము కిందభాగంలో గాయం

అగనంపూడి: సైకిల్ తొక్కుకుని వెళ్తున్న ఆరేళ్ల బాలుడు హర్షను ఐదు కుక్కలు వెంబడించి గాయపరిచిన ఘటన 86వ వార్డు రాజీవ్‌నగర్ ఫేజ్–1లో జరిగింది. ఈ ఘటనలో బాలుడి పిరుదుల భాగంపై గాయాలయ్యాయి. దీంతో వెంటనే బాలుడిని అగనంపూడి ఏరియా ఆస్పత్రికి తరలించి, యాంటీ ర్యాబిస్ వ్యాక్సిన్ వేయించారు. బాలుడి తండ్రి కోటేశ్వరరావు మాట్లాడుతూ కొన్ని నెలలుగా కాలనీలో పదుల సంఖ్యలో కుక్కలు తిరుగుతున్నాయని, కొత్తవారిపై, పిల్లలపై దాడులు చేస్తున్నాయని తెలిపారు. రెండున్నర నెలల క్రితం అపార్ట్‌మెంట్ వాచ్‌మన్ కుమారుడి చెవి దగ్గర కరిచాయని స్థానికులు తెలియజేశారు. జీవీఎంసీ కమిషనర్ స్పందించి కుక్కల ఏరివేత చేపట్టాలని కాలనీవాసులు డిమాండ్ చేస్తున్నారు.

సెయిల్‌లో విలీనంపై సత్వర చర్యలు చేపట్టాలి

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్‌ను సెయిల్‌లో విలీనం చేసే అంశంపై ప్రభుత్వం సత్వర చర్యలు చేపట్టాలని స్టీల్ ఐఎన్‌టీయూసీ ప్రధాన కార్యదర్శి మంత్రి రాజశేఖర్ డిమాండ్ చేశారు. సెంట్రల్ స్టోర్స్ యూనియన్ పాయింట్ వద్ద గురువారం నిర్వహించిన కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. స్టీల్‌ప్లాంట్ ఉత్పత్తికి అవసరమైన ముడి సరకులు లేకపోవడంతో ఉత్పత్తి తగ్గించుకోవాల్సి వస్తుందన్నారు. సెయిల్‌లో విలీనం చేసే అంశంపై ఎంపీలు, ఎమ్మెల్యేలు కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి తేవాలన్నారు. కార్యక్రమంలో నాయకులు కారు రమణ, కొమ్ము ప్రసాద్, పి.వి.నగేష్, కొవిరి అవతారం, మంత్రి గోపీనారాయణ తదితరులు పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న రాజశేఖర్

కళలకు పుట్టినిల్లు మన భారతావని

- వాటిని కాపాడాల్సిన బాధ్యత అందరిదీ
- లంకెలపాలెం జెడ్పీ హైస్కూల్ హెచ్‌ఎం నాగేశ్వరరావు
- పాఠశాలల్లో అలరించిన సాంస్కృతిక కార్యక్రమాలు


లంకెలపాలెం పాఠశాలలో విద్యార్థుల నృత్య ప్రదర్శన


అలరించిన పెదముషిడివాడ పాఠశాల విద్యార్థుల నృత్య ప్రదర్శన

అగనంపూడి: ప్రాచీన కళలకు పుట్టినిల్లు మన భారతదేశమని లంకెలపాలెం ప్రధానోపాధ్యాయుడు రౌతు నాగేశ్వరరావు అన్నారు. పాశ్చాత్య సంస్కృతి మోజులో మరుగున పడిపోతున్న మన భారతీయ సంస్కృతిని, సంప్రదాయ కళలను పరిరక్షించాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. శిక్షా సప్తాహ్ కార్యక్రమంలో భాగంగా పాఠశాలలో విద్యార్థులు పలు సాంస్కృతిక ప్రదర్శనలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కళలను ఆదరించాలని, ముందు తరాలకు అందించాలని విద్యార్థులకు సూచించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు రమణ, రాజశేఖర్, శ్రీను, పీడీ లక్ష్మిరాణి తదితరులు పాల్గొన్నారు.

- పెదముషిడివాడ జెడ్పీ హైస్కూల్లో విద్యార్థుల నృత్య ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. నాటికలు అలరించాయి. కార్యక్రమంలో హెచ్‌ఎం కృష్ణ, ఉపాధ్యాయులు పెద్దినాయుడు, సుధాకర్, వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.
- వాడచీపురుపల్లి జెడ్పీ హైస్కూల్లో విద్యార్థులు దేశంలోని వివిధ ప్రాంతీయుల వేషధారణలో ఆకట్టుకున్నారు. బాలలు కోలాటం ప్రదర్శించారు. జానపద నృత్య ప్రదర్శనతో విద్యార్థులు అలరించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం పందిరి కనకేశ్వరరావు, ఉపాధ్యాయులు వరలక్ష్మి, సుజాత, కామేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

అలరించిన ప్రదర్శనలు

అక్కిరెడ్డిపాలెం: అక్కిరెడ్డిపాలెం హైస్కూల్లో ఇన్‌చార్జి హెచ్‌ఎం కుమారస్వామి ఆధ్వర్యంలో శిక్షా సప్తాహ్ కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. విద్యార్థుల నృత్య రూపకం అలరించింది. స్వాతంత్య్ర సమరయోధుల చిత్రపటాలను విద్యార్థులు ప్రదర్శించారు.

- మింది జెడ్పీ హైస్కూల్లో హెచ్‌ఎం పీవీఎస్ఎస్ ఎస్ ఆంజనేయ ఆధ్వర్యంలో సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. విద్యార్థుల నృత్యాలు అలరించాయి. నాటి ఉపాధ్యాయుల వేషభాషలను అనుకరిస్తూ విద్యార్థులు పంచెకట్టుతో ఆకట్టుకున్నారు.


అక్కిరెడ్డిపాలెం ఉన్నత పాఠశాలలో సంప్రదాయ నృత్యం ప్రదర్శిస్తున్న విద్యార్థిని



మింది హైస్కూల్లో నృత్యాలు ప్రదర్శిస్తున్న విద్యార్థినులు

లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో రహదారి మరమ్మతులు


రహదారి మరమ్మతులు చేస్తున్న కార్మికులు

ఉక్కునగరం: లయన్స్ క్లబ్ కూర్మన్నపాలెం శాఖ ఆధ్వర్యంలో దువ్వాడ రైల్వే స్టేషన్ రహదారి మరమ్మతులు నిర్వహించారు. స్టేషన్ రహదారిలోని గుంతల వలన ప్రజలు పడుతున్న ఇబ్బందులను గుర్తించి, వారి నుంచి వచ్చిన విజ్ఞప్తి మేరకు లయన్స్ క్లబ్ అధ్యక్షుడు మురళీధరరెడ్డి ఆర్థిక సాయంతో గురువారం ఈ పనులు చేపట్టారు. కార్యక్రమంలో లయన్స్ క్లబ్ అధ్యక్షుడు మురళీధర్ రెడ్డి, లయన్స్ క్లబ్ సభ్యులు కె. ప్రసాద్ నాయుడు, శ్రీనివాస్, ఎ.సూర్యనారాయణ పాల్గొన్నారు.

విదేశీ ఉన్నత విద్యావకాశాలపై సదస్సు


మాట్లాడుతున్న జినియా మల్లిక్

అగనంపూడి: విదేశాల్లో ఉన్నత చదువులకు గల అవకాశాలపై దువ్వాడ విజ్ఞాన్ ఇంజినీరింగ్ కళాశాలలో అవగాహన సదస్సు నిర్వహించారు. అమెరికాలోని రోచెస్టర్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ ప్రతినిధి జినియా మల్లిక్ మాట్లాడుతూ ఏ దేశం ఏ కోర్సులకు అనుకూలంగా ఉంటుంది, స్కాలర్‌షిప్‌ల మంజూరు వివరాలను వెల్లడించారు. కార్యక్రమంలో ఇల్లినాయిస్ టెక్నాలజీ ప్రతినిధి ఆఫ్తాభాజీ, షార్ లైట్ గ్రూప్ ఆఫ్ టెక్నాలజీస్ నుంచి మెర్సీ పాల్, ఐడీపీ విశాఖ బ్రాంచ్ మేనేజర్ సెంథిల్‌నాథన్, కళాశాల ప్రిన్సిపాల్ సుధాకర్, రెక్టార్ వి.మధుసూదనరావు తదితరులు మాట్లాడారు.

ప్రైవేట్ పాఠశాలల యాజమాన్యాలకు శిక్షణ రేపు


సమావేశంలో మాట్లాడుతున్న జిప్సా అధ్యక్షుడు భాస్కరరావు

అక్కిరెడ్డిపాలెం: జిప్సా ఆధ్వర్యంలో ప్రైవేట్ పాఠశాలల యాజమాన్యాలకు శనివారం శిక్షణ కార్యక్రమం నిర్వహించనున్నట్లు జిప్సా అధ్యక్షుడు పాలవలస భాస్కరరావు తెలిపారు. పాఠశాలలు, విద్యార్థులకు సంబంధించిన రికార్డుల నిర్వహణపై గాజువాక ఎంఈవోలు ఎం.సునీత, బి.విశ్వనాథం అవగాహన కల్పిస్తారన్నారు. చట్టివానిపాలెంలోని బీవీఎస్ స్కూల్లో గురువారం నిర్వహించిన జిప్సా కార్యవర్గ సమావేశంలో ఆయన మాట్లాడారు. పాతగాజువాక చైతన్యనగర్‌లోని శ్రీ సూర్యతేజ్ స్కూల్లో శనివారం నిర్వహించే సమావేశానికి విశాఖ ప్రాంతీయ విద్యా సంచాలకుడు విజయభాస్కర్ కూడా హాజరు కానున్నారని తెలియజేశారు. జిప్సా పరిధిలోని పాఠశాలల ప్రతినిధులంతా హాజరు కావాలని సూచించారు. కార్యక్రమంలో జిప్సా కార్యదర్శి బి.శ్రీనివాస్, కోశాధికారి డి.శ్రీనివాసరావు, పలువురు సభ్యులు పాల్గొన్నారు.

కమిషనర్‌కు అభినందనల వెల్లువ


కమిషనర్ సంపత్ కుమార్‌కు పుష్పగుచ్ఛాలను అందజేస్తున్న కార్పొరేటర్లు గంగారాం, స్టాలిన్

అక్కిరెడ్డిపాలెం: జీవీఎంసీ నూతన కమిషనర్‌గా బాధ్యతలు స్వీకరించిన సంపత్ కుమార్‌ను ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ మెంబర్లు బోనెల జోసెఫ్, కటికల కల్పన, జలగడుగుల శ్రీనివాసరావు మర్యాదపూర్వకంగా కలిశారు. పుష్పగుచ్ఛాలను అందజేసి అభినందనలు తెలిపారు.

- జీవీఎంసీ 72, 78 వార్డుల కార్పొరేటర్లు ఎ.జె.స్టాలిన్, బి.గంగారాం కమిషనర్ సంపత్ కుమార్‌ను కలిసి శుభాకాంక్షలు తెలిపారు.
- జీవీఎంసీ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ సీఐటీయూ ఆధ్వర్యంలో పంచాయతీ కార్మికులు, యూజీడీ, వెటర్నరీ, పార్కు, కార్యాలయాల్లో పనిచేసే ఉద్యోగులు కమిషనర్‌ను కలిశారు. అనంతరం తమ విభాగాల్లో సమస్యలపై వినతిపత్రాలను అందజేశారు. కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ గౌరవ అధ్యక్షుడు పి.వెంకట రెడ్డి, సిటూ జోన్–1, 6 భీమిలి, గాజువాక సభ్యులు ముద్దాడ ప్రసాద్, గొలగాని అప్పారావు, ఆదినారాయణ, శ్రవణ్, కె.వి.రమణ తదితరులు పాల్గొన్నారు.